స్వామి, కళ: చలం, స్టిల్స్: సారధి, ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్: కృష్ణమూర్తి, నృత్యం: చోప్రా, ప్రెస్ రిలేషన్స్: శ్రీ కృష్ణ.

♦ ♦ ♦

"ఓ మనిషీ తిరిగి చూడు"

దేశానికి బానిసత్వం పోయినా – బానిసత్వంలో మ్రగ్గిపోతున్న బలహీన వర్గాలకు విముక్తి ఎప్పుడు కలుగుతుంది? గొడ్డలిపెట్టులాంటి ఈ తీరని సమస్యాపూరితమైన ప్రశ్నకు సమాధానంగా రూపొందిన చిత్రమే "ఓ మనిషీ తిరిగి చూడు"! అనుక్షణం ఎదను దూసుకుపోయే చక్కని కథాగమనంగల ఈ చిత్రాన్ని నిర్మాత శ్రీ దిడ్డి శ్రీహరిరావు బాబ్ అండ్ బాబ్ ఆర్ట్ పిక్చర్స్ బేనర్ క్రింద శ్రీ దాసరి నారాయణ రావు దర్శకత్వంలో రూపొందించారు. విశాలాంధ్ర అంతటా విడుదలై విజయవిహారం చేస్తున్న ఈ చిత్రంలో మురళీమోహన్, ఈశ్వరరావు, మోహన్‌బాబు, పేకేటి, జి. ఎస్. ఆర్. మూర్తి, బెనర్జీ, గోకిన రామారావు, జయసుధ, నిర్మల, కె. విజయ ప్రభృతులు నటించారు. ఆంధ్రప్రదేశ్ పరిసర ప్రాంతాలలో ప్రకృతి సౌందర్యం వెల్లివిరిసే వాస్తవ దృశ్యాలతో ఇది సినిమాకాదు – వాస్తవ జీవిత గాథ అనేలా ప్రతి ప్రేక్షక హృదయాన్ని హత్తుకుపోయేలా చిత్రీకరింపబడిన ఈ చిత్రం – బెంగాలి, మలయాళీ చిత్ర నిర్మాతలనుకూడా ఆకర్షింపబడి బెంగాలి, మలయాళ భాషలలో చిత్రరూపం దాల్చేందుకు సిద్ధమైంది. ఈ "ఓ మనిషీ తిరిగి చూడు" రష్యా యాత్రకుకూడా సిద్ధంకావడం మరో ముఖ్య విశేషం.

ఈ చిత్రం తెలుగునాట విడుదల కాకముందే ఇన్ని ఘనవిజయాలను సాధించుకోగలగటం ముదావహం. ఇంత చక్కటి చిత్రాన్ని ఆంధ్ర ప్రజలకు అందించిన ఈ చిత్ర నిర్మాత ఎంతైనా అభినందనీయులు. ప్రెస్ రిలేషన్స్: శ్రీకృష్ణ.

★

# : అపహేళన :

* రచన : శ్రీ పొన్నా నూకరాజు *

త్రిగుణ్ యథావిధంగా ఆ ఇంట్లో అడుగు పెట్టాడు. ఎవరి పనుల్లో వాళ్ళువున్నట్టున్నారు. తన్నెవరూ పట్టించుకోలేదు.

త్రిగుణ్ వచ్చాడు... త్రిగుణ్ వచ్చాడంటూ సంబరపడి చుట్టూ మూగే ఆ కుటుంబ సభ్యులంతా ఏమయ్యారు. ఈ నిశ్శబ్ద వాతావరణానికి కారణమేమైవుంటుంది.

వీధిలోంచి బొంగరం తిప్పుకుంటూ డుంబూ వచ్చాడు.

"మీ నాగేష్ అన్నయ్య ఎక్కడికి వెళ్ళాడు డుంబూ!" అన్నాడు.

డుంబూ చెప్పకుండా నిర్లక్ష్యంగా పోజు పెట్టి వెళ్ళిపోయాడు మళ్ళీ వీధిలోనికి మంచి నీళ్ళు తాగి.

తన కంఠధ్వని విని కర్టెన్ని తొలగించి కిటికీలోంచిచూసి, మళ్ళీ మూసేసుకుంది సావిత్రి. ఆమె కళ్ళల్లోని మూగభాషను నేర్చుకోడానికి అలవాటుపడ్డాయి తన కళ్ళు రెండు నెల్లబట్టి.

ఆక్షణంలో ఆమె కళ్ళవెనుక కనపడ్డ అగాధ గాధనుచూసి తట్టుకోలేక పోయాయి తన కళ్ళు.

ఆక్షణంలో నాగేష్ ఇంట్లోవున్నా కావున్ను. పిలవని పేరంటానికి వచ్చినట్టుగావుంది తన స్థితి.

'నాగేష్‌వున్నాడా! సావిత్రీ!' అన్నాడు గతపరిచయంలోని చనువును ఆసరాగా తీసుకుని.

సమాధానం లేదు.

ఇంటిలోంచి వచ్చింది సావిత్రి తల్లి కాళీకాంబ. ఆమె స్థూలకాయం, చేతిలోని అట్లకాడ, నుదుటిని అర్థరూపాయంత బొట్టు చూస్తుంటే ఆమె నిజంగా కాళికాదేవిలాగానే తోచింది తనకు.

'ఏం నాయనా! మళ్ళీ ఏదైనా, కథ పడిందా? ఇలా వచ్చావ్! లేక...' అంటూ అర్థోక్తిలోనే ఆపేసిందామె.

ఆ స్వరంలో మునుపటి ఆప్యాయతకి బదులు అవహేళన ధ్వనించింది. మాణిక్యవీణలో ఎక్కడో తీగ తెగింది.

'లేదండి! కథపడుతున్నట్టు ఇంటిమేషన్ వచ్చింది. మొన్నపడిన కథకి యం.ఓ. పంపించారు పత్రిక వాళ్ళు...నాగేష్ ఇంటిలో లేడాండి?' తన మాటలు ఎందుకో తడబడ్డాయి.

'నీలా కథలు రాసుకోడానికి వాడికి కుదురొద్దా? బిఏకి కడుతున్నాడు' అంటూ తలుపు దభాలున వేసుకుంది.

'కథ రాసి అలసిపోయివచ్చినట్టున్నావు. ఈ కాఫీ తీసుకో త్రిగుణ్!' అనే కాళీకాంబకి ఈ కాళీకాంబకి ఎంత తేడా!

ఇంక అక్కడ నిలవకూడదనుకుని గిరుక్కున వెనక్కి తిరిగాడు. అంతలో చిన్న కాగితపు చుట్ట కాళ్ళముందుపడింది. చప్పున కుడిచేత్తో అందుకుని రూంకి నడిచాడు, తన ఆనందాన్ని సగం మింగేసిన కాళీకాంబను అమాంతంగా మింగేద్దామన్నంత కోపంవచ్చినా.

♦ ♦ ♦

నాగేష్ ఇంటర్‌లో నాక్లాస్ మేట్. పైగా గరస్ తీరమ్స్, రైడర్స్‌వాళ్ళింటిలోనే కూర్చుని సాల్వ్ చేసుకునేవాళ్ళు. సావిత్రి నాగేష్ అక్కయ్య. శామనఛాయగావుంటుంది. పెళ్ళీడు దాటినపిల్ల. కొత్తక్రొత్త కోరికలకోసం పువ్విళ్ళూరువయసు. ఆ వయసుకు చుట్టూ కటకటాలుకట్టి కాపలాకాసే కాళీకాంబ.

పాపం! సావిత్రి ఆ కటకటాల్లోనే అలా ముసలిదై పోతుందేమో? సావిత్రిమీద ఎందుకు తనకీ విచిత్ర సానుభూతి.

చీటీ జాగ్రర్తగా మడతలు విప్పాడు. సావిత్రికి లేని అందచందాలు ఆ చీటిలోని అక్షరాలకున్నాయి.

త్రిగుణా!

నీకేమని చెప్పి. బోధపర్చాలో నాకు తెలీడంలేదు. ఇక్కడ ఘనీభవించిన వాతావరణం చూసే వెళ్ళావు. ఇదంతా అమ్మచేసిన కట్టుబాటు. నీవు నన్నుచూసి నవ్వినందుకు, అవేళ పత్రిక నాగేష్ అడుగుతుంటే నాచేతకిచ్చినందుకు. నీ వెళ్ళిపోయిన తర్వాత అమ్మ ఎంత రభస చేసిందో చెప్పుకుంటే సిగ్గుగావుంది. అమ్మ వట్టి భోళా మనిషి. ఎప్పుడెలా ప్రవర్తిస్తుందో చెప్పలేం. నామూలంగా నీవు నిదలుపడ్డకూడదు. నీతో కలుపుగోరుగా నవ్వాననే రోజులుపోయాయి. దయచేసి నువ్వు ఈ ఇంటి గడప తొక్కవద్దని ప్రార్థిస్తున్నాను.

ఇట్లు,
సావిత్రి.

---

"కథాంజలి"లో వెలువడే కథలన్నీ కేవలం కల్పితము. ఎవరినీ ఉద్దేశించి వ్రాసినది కాదు. రచయితల రచనలకు మేము ఏమాత్రము బాధ్యులు కాదు. —సంపాదకుడు.